## క్లుప్తంగా

### ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈగా శ్రీనివాసులరెడ్డి



ముద్దనూరు : ఏపీ ఎస్పీడీసీఎల్ మండల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.శ్రీనివాసులరెడ్డి ఆదివారం విధుల్లో చేరారు. అనంతపురం జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ముద్దనూరు ఏఈఈగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వర్మ బదిలీ అయ్యారు.

### నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 11 కేవీ కింద ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కారణంగా భాకరాపురం పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు, రాయచోటి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి వారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారీ సంఖ్యలో తరలి వస్తుంటారు.

### ఘనంగా చల్ల మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో పెద్దమ్మతల్లి చల్ల(బోణాలు) మహోత్సవం కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మతల్లి దగ్గర ఉన్న కడవలలో గ్రామస్తులు బోణాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి చల్ల బోణాలకు గ్రామోత్సవం నిర్వహించి గ్రామ పొలాలలో పెద్దమ్మతల్లికి చల్లా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### 21న ఆలయ భూముల వేలం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర ఆలయాలకు సంబంధించిన భూములకు ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించబడునని ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. శ్రీమాధవ-ఆంజనేయ ఆలయానికి సంబంధించిన 193 ఎకరాలు, శ్రీ ఈశ్వర-వీరభద్ర ఆలయానికి సంబంధించిన 54 ఎకరాలుకు మూడు సంవత్సరాల కౌలుకు వేలం పాట జరుగుతుందన్నారు.

### వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన దగ్గుపాని లక్ష్మీప్రసన్న, ప్రణీత్‌రెడ్డి వివాహానికి దుగ్గపాని నాగిరెడ్డి, గంగమ్మల ఆహ్వానం మేరకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, బొగుడుపల్లి సుదర్శన్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్యలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

### నేడు విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆదివారం నలసాలమ్మ, పోతురాజు, నాగదేవత, గోపుర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. న్యూ కేటగిరి వృషభరాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు.

### గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులను చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

# వెబ్‌ల్యాండ్ సమస్యతో తిప్పలు

- భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు
- ఎల్‌పీఎం నంబర్ల కారణంగా రాని 1-బిలు, అడంగల్లు
- రెన్యూవల్ కాని బ్యాంకు రుణాలు
- రైతులకు ఇబ్బందులు
- అధికారులపై దూషణలు

చక్రాయపేట : రీసర్వే జరిగిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ సమస్య ఇటు రైతులను అటు అధికారులను ముప్పతిప్పలు పెడుతోంది. భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు, ఎల్‌పీఎం నంబర్లు, డీకేటీలు, ఇనాం తదితర భూ సమస్యలు కొందరి రైతులకు మేలు చేకూరితే మరి కొందరికి తీరని నష్టాన్ని కలిగిస్తోంది. ఈ సమస్య కారణంగా 1-బిలు రాక బ్యాంకుల్లో కొత్త రుణాలు తీసుకునేందుకు వీలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెన్యూవల్స్‌కు మాత్రం వీఆర్వోలు తెల్ల కాగితం ఇచ్చే 1-బి చెల్లుతుండటంతో కొందరు తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. అయితే శాశ్వత సమస్య పరిష్కారం ఇప్పట్లో తీరేలా లేక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దిక్కుతోచక రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదు. కొందరు గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినా ప్రయోజనం లేదు. దీంతో రైతులు దిక్కుతోచక అధికారులపై దూషణలకు దిగుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలకు అవకాశం లేదు ఈ సమస్య తీరాలంటే కలెక్టర్, జేసీలు వెబ్‌ల్యాండ్‌లో సవరణలకు వీలు కల్పిస్తే ఇక్కడ తాము రైతుల పనులు చేయగలుగుతామని లేకుంటే ఇలా తిట్లు తింటూ మానసికంగా ఇబ్బందులు పడాల్సిందేనని రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వెబ్‌ల్యాండ్ సమస్య ఏమంటే..**

రీసర్వే సమయంలో సర్వేయర్లు కొలతలు వేయకుండా సాగులో ఉన్న విస్తీర్ణం మేరకు గట్టు ఎక్కడ ఉంటే అక్కడ జియోట్యాగ్ చేసి అప్‌లోడ్ చేశారు. దీంతో గట్లు సర్ది ఇతరుల భూమి ఆక్రమించుకున్న వారికి మేలు జరిగింది. ఈసీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కలిగి ఉన్న అసలు రైతుకు నష్టం కలిగింది. ఉదాహరణకు అన్ని డాక్యుమెంట్లు కలిగి ఉన్న రైతు పొలాన్ని పొరుగు రైతు గట్లు సర్దుకుంటూ 10 సెంట్ల మేర ఆక్రమించి ఉంటే రీసర్వేలో జరిగిన తప్పిదాల కారణంగా ఆక్రమించుకున్న భూమికి సర్వహక్కులు కల్పించారు. అయితే ఆక్రమించుకున్న భూమికి ఇప్పుడు అధికారులు కల్పించిన హక్కు తప్ప గతంలో రికార్డుల్లో హక్కులు ఉండవు. అన్ని హక్కులు కలిగిన రైతులకు ఎకరాకు బదులు 90 సెంట్ల మేరకే ఆన్‌లైన్ చూపుతోంది. దీంతో సదరు రైతులు అధికారులను ఆశ్రయిస్తే ఆక్రమించుకున్న రైతు వద్ద సంతకాలు చేయించుకురండి అని సమాధానం ఇస్తున్నారు. ఇందులో కొందరు రైతులు వారి సొమ్ము మాకు వద్దు అని మానవతా దృక్పథంతో సతకాలు చేస్తుంటే మరి కొందరు అడ్డుతిరిగి మీ ఇష్టం ఉన్న వారికి చెప్పుకోండి ఈ భూమి మాది అందుకే మాకు హక్కులు వచ్చాయి అని ఎదురు తిరుగుతున్నారు. ఘర్షణలు పడుతున్నారు. సంతకాలు చేయించిన రైతుల సమస్య పరిష్కారం చేస్తామంటే వెబ్‌ల్యాండ్‌లో సవరణల చేసేందుకు వీలు లేకుండా అధికారులు లాక్ చేశారు. దీంతో సమస్యలు పరిష్కారం కాలేదు. అర్జీలు పెట్టుకున్న రైతుల వద్దకు రెవెన్యూ సిబ్బంది వెళ్లి సమస్య తీరిందని కాళ్లవేళ్ల బ్రతిమాలుడుతున్నారు. దీనికి తోడు ఎవరి పట్టాదారు పాస్‌బుక్‌లో ఉన్న ఖాతా మేరకు వారి సర్వే నంబర్లు ఉన్నాయా అంటే అదీలేదు. కొత్తగా డీఎల్ఆర్(డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిష్టర్)లో ఎల్‌పీఎం నంబర్లు అంటూ కొత్తగా తీసుకు వచ్చారు. ఎల్‌పీఎం నంబర్ల అనుసందానం సమయంలో సర్వే సిబ్బంది చేసిన పొరపాట్ల కారణంగా వెబ్‌ల్యాండ్‌లో 1-బిలు రావడంలేదు. వీటిని సరిదిద్దే ఆప్షన్‌లు వెబ్‌ల్యాండ్‌లో లేవు ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గతంలో అసైన్ మెంట్‌లో ఇచ్చిన డీకేటీ, ఇనాం భూములను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు. దీంతో ఆభూములపై బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు రెన్యూవల్ చేసుకునేందుకు 1-బిలు రాలేదు. చివరకు వీఆర్వోలు తెల్ల కాగితంపై 1-బి ఇద్దామనుకున్నా వీలు లేక పోవడంతో సదరు భూములు కలిగిన రైతులు బ్యాంకులో తీసుకున్న రుణానికి రెన్యూవల్ చేసుకునే వెసులుబాటు కూడా లేదు. దీంతో సదరు రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. దీంతో వారు రెవెన్యూ సిబ్బందిపై ధూషణలకు దిగుతున్నారు. పైసమస్యలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి తమగోడు చెప్పుకుంటే సదరు వినతిపత్రాన్ని తిరిగి మండల తహసీల్దారు వద్దకే పంపుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేసే వీలు లేక ఇటు సమస్య పరిష్కారం చేయలేక రైతులతో తిట్లు తింటూ మరో పక్క గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన అర్జీల ప్రోగ్రెస్‌పై ఉన్నతాధికారులు అడిగే ప్రశ్నలకు సమాదానాలు చెప్పుకోలేక ఆత్మాభిమానాన్ని చంపుకుని విధులు నిర్వహిస్తున్నామని కొందరు రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వ నేతలు ఇప్పుడు తమగోడును పట్టించుకోలేదని రైతులు మండి పడుతున్నారు.



భూసమస్యలకు నిలయంగా మారిన తహసీల్దారు కార్యాలయం

**కలెక్టర్ చొరవ చూపితేనే**

రీసర్వే సమస్యలు తొలగి రైతులు రెవెన్యూ ఉద్యోగులు సంతోషంగా ఉండాలంటే కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు చొరవ చూపాల్సి ఉంది. ప్రజలు ప్రభుత్వానికి మధ్యన వారధుల్లా ఉన్న కలెక్టర్, జేసీలు తమ చేతిలో ఉన్న వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేసే విధంగా అవకాశం కల్పించాల్సిన బాధ్యత వారి చేతుల్లో ఉన్నా పట్టించుకోక పోవడం సమస్యలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి వెబ్‌ల్యాండ్ సవరణలకు అవకాశం కల్పించాలని ఉద్యోగులు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**విలువైన భూమిని కోల్పోయా**



తాను కొనుగోలు చేసిన విలువైన భూమిలో పొరుగు రైతు కొంత ఆక్రమించాడు. రీసర్వేలో నేను కొన్న భూమిలో విస్తీర్ణం తగ్గింది. దీంతో తాను ఈసీ, రిజిస్ట్రేషన్ పత్రాలు చూపి నాభూమికి కొలతలు వేసి ఇవ్వాలని కోరినా అధికారులు పలకలేదు. 1-బి తీస్తే విస్తీర్ణం తగ్గింది. ఈ విషయంపై గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అన్ని రికార్డులు ఉన్న నాకు అన్యాయం చేస్తూ ఆక్రమణ దారుడికి ఎలాంటి రికార్డులు లేకున్నా హక్కులు కల్పించడం ఎంత మాత్రం న్యాయం.

– బత్తిన మల్లికార్జునరెడ్డి, అద్దాలమర్రి, చక్రాయపేట

**కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా కనికరం లేదు**



డీకేటీ పత్రాలు పొంది భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమకు వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్ చేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. 1-బిలు రాలేదు. బ్యాంకుల్లో రుణం రెన్యూవల్ చేసుకునే వీలు లేదు. డీకేటీ భూములతో పాటు ఇనాం భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదు. గడువు లోపు రుణం రెన్యూవల్ చేసుకుంటే వడ్డీ తగ్గుతుంది. లేకుంటే అధిక వడ్డీ పడుతుంది. లోన్ రెన్యూవల్ చేయండి. లేదా అప్పు తీర్చండి అంటూ ఇక బ్యాంకు వారు తమపై వత్తిడి తెచ్చే సమయం ఆసన్నమైంది. ఏమిచేయాలో తెలియడంలేదు.

– మల్లేపల్లె ఏసోబు, డీబీఎస్‌యూ జిల్లా కన్వీనర్, రాజీవునగర్, చక్రాయపేట

## ప్రమాదకర ప్రయాణం

పులివెందుల రూరల్ : పరిమితికి మించి ఆటలలో ప్రయాణించొద్దని పోలీసులు పదేపదే చెబుతూన్నారు. తెలిసినా కొందరు ప్రాణాలపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో వివిధ పనులు నిమిత్తం ముదిగుబ్బ, కదిరి, దొరిగిల్లు ప్రాంతాల నుంచి ఇలా వాహనాల్లో వెనుక భాగాల్లో కూర్చొని పులివెందులకు పనుల కోసం వస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద కుదుపులకు వీళ్ళ కింద పడి ప్రాణాలు కోల్పోయే ఆస్కారం ఉంది. సంబంధిత అధికారులు అధిక లోడుతో వెళ్తున్న ఆటోలు, బొలెరో వాహనాలను చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రాణాలు పోయాక చర్యలు చేపడితే ఏం లాభమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలా అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రమాదకరంగా వాహనంపై ప్రయాణిస్తున్న కూలీలు

## 22న హనుమాన్ శోభాయాత్ర

చక్రాయపేట : హనుమజ్జయంతి సందర్భంగా ఈనెల 22 గురువారం హనుమాన్ శోభాయాత్ర మోటారు సైకిళ్లతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు శ్రీ వేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు గండి వీరాంజనేయస్వామి సన్నిధి నుంచి ప్రారంభమవుతుందన్నారు. అద్దాలమర్రి, కుమార్లకాల్వ, ఎర్రబొమ్మనపల్లె, కె.రాజుపల్లె, కుప్పం, నెరుసుపల్లె, మహదేవపల్లె, సురభి, చిలేకాంపల్లె గ్రామాల మీదుగా చక్రాయపేటకు చేరుతుందన్నారు. ప్రతి హిందువు శోభాయాత్రలో పాల్గొనేందుకు తమ మోటారు సైకిళ్లతో గండికి చేరాలని ఆయన కోరారు.

## ముగిసిన యల్లమ్మ జాతర



అమ్మవారి పూజల్లో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని చెన్నూరు కేఓఆర్ కాలనీలో వెలసిన యల్లమ్మతల్లి జాతర ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బ్రాహ్మణ వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి పోతులూరు స్వామి ప్రతిమను డప్పు వాయిద్యాలు నడుమ పోతురాజుస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి యల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బండలాగుడు పోటీలు ప్రారంభం



జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సుంకులమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు



రాతి దూలాన్నిలాగుతున్న ఎద్దులు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఆదివారం ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఈ తిరునాల మహోత్సవం జరిగింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సీనియర్ కేటగిరి ఎద్దులకు నిర్వహించిన బండ లాగుడు పోటీలను ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 7 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోలికి చెందిన ఎద్దులు అత్యధికంగా 4808.9 అడుగులు దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలియి. అలాగే ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 4685.10 అడుగులతో రెండో స్థానంలో, నంద్యాల జిల్లా సిరివెళ్లకు చెందిన కుందూరు రాంభూపాల్ రెడ్డి ఎద్దులు 4678.6 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంకు చెందిన రామాంజనేయులు ఎద్దులు 4644.2 అడుగులతో నాల్గవ స్థానంలో, ఖాజీపేట మండలం పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య ఎద్దులు 4271 అడుగులతో 5వ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రామాంజనేయులు ఎద్దు 3450.4 అడుగులతో 6వ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంకు చెందిన బంటుపల్లి రాజశేఖర్ ఎద్దులు 3055.4 అడుగులతో చివరి స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు నిర్వాహకులు అందజేశారు.

## ఘనంగా శ్రీగంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

పులివెందుల టౌన్ : పట్టణంలోని రజక కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీగంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాన్ని వైఎస్ కుటుంబీకుల ఆశీస్సులతో రూ.35 లక్షలతో నిర్మించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ మనోహర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోడి రమణ, గుణకనపల్లి శేఖర్‌రెడ్డిలు పూర్ణాహుతిలో పాల్గొని పూజలు నిర్వహించారు. పీఎమ్మార్ కన్‌స్ట్రక్షన్ అధినేత మహేశ్వర్‌రెడ్డి కుమారుడు తేజా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గాలివీడు నాగేశ్వరరావు బృందంచే సాసవుల చిన్నమ్మ కథ నాటకం నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

## ఆపరేషన్ సిందూర్ విజయంపై ర్యాలీ

జమ్మలమడుగు : పహాల్గాం ఉగ్రదాడికి నిరసనగా, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌పై విజయం సాధించినందుకు పట్టణంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూటమి ప్రభుత్వం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

**సింహాద్రిపురంలో..**

సింహాద్రిపురం : స్థానిక పురవీధులలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాలు

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



వరుడితో పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్ : కడప-రాయచోటి రోడ్డులోని కడప కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్ రఫీ కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

వీరిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాయచోటి మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంలున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ నేత సుభాన్ బాషా, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, జమాల్ వలి, దాసరి శివ, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామి రెడ్డి. చాక్లెట్ గౌస్, షఫీ, ఆరిఫ్, డివిజన్ ఇంచార్జ్ మున్నా తదితరులు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

వేంపల్లె : టీడీపీ కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎస్.తులసిరెడ్డి అన్నారు.




# ఎయిడ్స్ నివారణపై కొవ్వొత్తుల ప్రదర్శన



పులివెదులో కొవ్వొత్తుల ర్యాలీలో వైద్యులు, సిబ్బంది



వేంపల్లెలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పులివెందుల : ఎయిడ్స్‌తో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం అలాగే హెచ్ఐవితో పోరాడుతూ జీవిస్తున్న వారి కోసం మేమున్నామని భరోసా ఇవ్వాలని నగరిగుట్ట పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నుంచి పులివెందుల ఐసీటీసీ విభాగం, సీడీఎస్, స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నగరిగుట్ట పట్టణ ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్నేహ ప్రత్యూష ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్ బారిన పడి మరణించిన వారి ఆత్మశాంతి చేకూరాలని అలాగే హెచ్ఐవి వ్యాధితో జీవిస్తున్న వారికి మేమున్నామని భరోసా ఇస్తూ వారి జీవన ప్రమాణాన్ని పెంచేందుకు కషి చేయవలసిన బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ, ఎస్‌టీఐ కౌన్సిలర్‌లు వెంకటసుబ్బయ్య, బాదల్ వలి, డీపీఎం సుబ్బారెడ్డి, సీడీఎస్ మేనేజర్ వలి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేంపల్లెలో**

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణపై ఆరోగ్య సిబ్బంది కొవ్వుత్తుల ప్రదర్శన చేశారు. ఆదివారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఆరోగ్య కార్యకర్తలు మౌన ప్రదర్శన చేపట్టారు. అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినాన్ని ప్రతి ఎడాది మే 3వ ఆదివారం జరుపుకోవడం జరుగుతుందని తాళ్ళపల్లె వైద్యులు పృధ్వీకుమార్‌రెడ్డి తెలిపారు.

**జమ్మలమడుగులో..**

జమ్మలమడుగు రూరల్ : ఎయిడ్స్ బాధితులు డాక్టర్ల సూచన మేరకు మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల ప్రమాదం ఉండదని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాష అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

